సాక్షి
సూర్యాపేట
సోమవారం, 21, ఆగస్టు, 2023



గన్‌తో వచ్చి.. ఇంట్లోకి చొరబడి

గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి గన్‌తో ఓ టీచర్ ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించారు.


- 8లో



'ఫ్యాషన్' విద్యార్థుల సందడి

పోచంపల్లిలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థినులు సందడి చేశారు.

-10లో



యాదాద్రికి పోటెత్తిన భక్తులు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్య తరలివచ్చారు.

- 10లో

న్యూస్‌రీల్

నేటి నుంచి కొత్త కలెక్టరేట్‌లో ప్రజావాణి

దురాజ్ పల్లి (సూర్యాపేట) : ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం కుడకుడలోని కొత్త కలెక్టరేట్‌లో నేటి నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను తీసుకుని నూతన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి రావాలని కోరారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



ఆలయంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్య ధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణా చార్యులు, బ్రహ్మచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో వైభవంగా మహాసౌరహోమం



సౌరహోమంలో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహా సౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, బీరవో లు ఇంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

'నవోదయ' దరఖాస్తు గడువు మరోసారి పెంపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్‌వీ)లో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం తెలిపారు. ఈనెల 17వ తేదీ వరకు గడువును పెంచిన నవోదయ విద్యాలయ సమితి మరోసారి పది రోజుల పాటు పొడిగించారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎర్రవరంలో కమెడియన్ పృథ్వీరాజ్ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న పృథ్వీరాజ్

కోదాదరూరల్ : కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం దూళ్లగుట్ట శ్రీ బాల ఉగ్ర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కమెడియన్ పృథ్వీరాజ్ ఆదివారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోశాలను సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనర్సింహమూర్తి నివాసంలో సేదదీరారు.

ఆద్యంతం.. ఉత్సాహం





సూర్యాపేట నియోజకవర్గ ప్రగతి నివేదన సభకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- ప్రగతి నివేదన సభ విజయవంతం
- జోష్ నింపిన ముఖ్యమంత్రి టూర్
- ప్రభుత్వ భవనాలు, బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన కేసీఆర్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం
- సూర్యాపేట జిల్లాపై వరాల జల్లు

సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన హుషారుగా.. ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం 11గంటలకే జిల్లాకు రావాల్సి ఉండగా.. హైదరాబాద్‌లో వాతావరణం అనుకూలించకపోవడంతో దాదాపు 3గంటలు ఆలస్యంగా వచ్చారు. ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్న సీఎం.. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో పట్టణంలో పర్యటించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాన్ని ప్రారంభించి సద్దల చెరువు కట్ట కింద నుంచి మహాప్రస్థానం, మినీట్యాంక్ బండ్ పరిసరాలను కాన్వాయ్‌లో నుంచే పరిశీలిస్తూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు చేరుకున్నారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం మార్కెట్ ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే ఉన్న వ్యాపారుల వద్దకు వెళ్లి ఏర్పాట్లపై ఆరాతీశారు. అక్కడి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకుని ప్రారంభించారు. ఆ తర్వాత పక్కనే ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ, డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రత్యేక పూజలు చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభింపజేశారు. అక్కడే జిల్లా అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలులో అధికారులదే కీలక పాత్ర అని కొనియాడారు.

ఒక్కసారి ఆలోచించండంటూ..

ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం నూతన మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన సూర్యాపేట నియోజకవర్గ ప్రగతి నివేదన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్.. ఒకవైపు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూనే ప్రధానంగా ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 60 ఏళ్ల పాటు అధికారమిస్తే ఏం చేయలేని కాంగ్రెసోళ్లు ఒక్క ఛాన్స్ అంటున్నారని.. ప్రజలెవరూ మోసపోయి ఘోసపడొద్దని చెప్పారు. నాటి నల్లగొండ ఎట్లుండేనో.. నేటి జిల్లా పరిస్థితి ఏమిటో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఇటీవల కేబినెట్ సమావేశంలో రైతు రుణమాఫీపై మంత్రి జగదీశ్‌రెడ్డి ముందుండి వాదించాడని, దీంతో రుణమాఫీకి అంగీకరించామని ప్రకటించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు వదులుకోవద్దని, నల్లగొండ జిల్లాలోని 12 స్థానాలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.

వర్షం కురవలే.. వరాలు కురిశాయి

ప్రగతి నివేదన సభ సందర్భంగా వర్షం వస్తుందని అంతాభావించారు. కానీ, వాతావరణం అనుకూలించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేటపై వరాల జల్లు కురిపించారు. సూర్యాపేట జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ.10 లక్షల చొప్పున సీఎం నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున, సూర్యాపేట మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే సూర్యాపేటకు కళాభారతి కావాలని మంత్రి జగదీష్‌రెడ్డి కోరగా.. రూ.25కోట్లు మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వెళ్తూ పట్టణాన్ని పరిశీలించానని, వందలాది కొత్త బిల్డింగ్‌లు వచ్చినయ్ అని అన్నారు. సూర్యాపేట అభివృద్ధిని కళ్లారా చూశానని.. అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. మహిళా పాలిటెక్నిక్ కాలేజీ కావాలని కూడా మంత్రి అడిగారని.. దాన్ని కూడా మంజూరు చేస్తామన్నారు. స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. మంత్రి జగదీశ్ రెడ్డి అడిగినట్లు ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ కూడా మంజూరు చేయాలని ఆ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి సూచించారు.

సిట్టింగ్‌లకు క్లియరేనా!

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 స్థానాలను గెలిపించుకోవాలనడం, సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల అభ్యర్థులపై ఎలాంటి ప్రస్తావనా తేకపోవడంపై జిల్లాలోని నాలుగు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ అవకాశం ఉంటుందా లేదా అన్న విషయంపై సందిగ్ధం నెలకొంది.

సూర్యాపేట గులాబీమయం

సూర్యాపేట ప్రగతి నివేదన సభకు భారీగా జనం తరలిరావడంతో పట్టణమంతా ఎక్కడ చూసినా గులాబీ జెండాలు, పార్టీ కార్యకర్తలతో కిటకిటలాడింది. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ముందు నుంచే ప్రణాళిక ప్రకారం జన సమీకరణ చేయడంతో కిక్కిరిసిపోయింది. పట్టణంలో పలు ప్రారంభోత్సవాల సందర్భంగా అడుగడుగునా ప్రజలు పుష్పాలతో స్వాగతం పలికారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలతో గులాబీ తోరణాలు దర్శనమిచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు డప్పువాయిద్యాల నడుమ ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. సీఎం రావడం కొంత ఆలస్యం అయినప్పటికీ కేసీఆర్‌ను చూసేందుకు, ప్రసంగం వినేందుకు జనం సభ స్థలంలోనే ఉన్నారు.



వ్యవసాయానికి పూర్వవైభవం

- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : సీఎం కేసీఆర్ చలువతో సూర్యాపేట జిల్లాలో వ్యవసాయానికి పూర్వవైభవం వచ్చిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సూర్యాపేట నియోజకవర్గ ప్రగతి నివేదన సభలో ఆయన మాట్లాడారు. 60 ఏళ్లుగా వెనుకబడిన జిల్లా పదేళ్లలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కాకతీయులు, నిజాం కాలం నాటి వ్యవసాయంతో కళకళలాడిన సూర్యాపేట జిల్లా .. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో అన్నం దొరకని, ఆకలిచావుల జిల్లాగా మారిందన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోయి ఫ్లోరోసిస్ బాధితులుగా తయారయ్యామని చెప్పారు. తెలంగాణను తెచ్చి ఆరేళ్లలో అన్నం పెట్టే జిల్లాగా మార్చిన ఘనుడు కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్ పాలనలో కాళేశ్వరం నిర్మాణం పూర్తయి ఈ నీళ్లతో కాళేశ్వరం నుంచి పెన్‌పహాడ్ మండలం రావిచెరువు వరకు ప్రాంతాలన్నీ సస్యశ్యామలంగా మారాయన్నారు. సభలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక , ఎమ్మెల్యేలు కిషోర్, మల్లయ్య యాదవ్, సైదిరెడ్డి, భూపాల్ రెడ్డి, రవీంద్ర నాయక్, సునీత, లింగయ్య, ప్రభాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, భాస్కరరావు, భరత్, ఎమ్మెల్సీలు రాజేశ్వర్ రెడ్డి, రవీందర్ రావు, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఉమా మాధవరెడ్డి, చందర్‌రావు, నల్లగొండ, యాదాద్రి జెడ్పీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, సందీప్ రెడ్డి, సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీ శంకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె రవికుమార్, కన్మంతరెడ్డి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ వెంకట్రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం, చిత్రంలో మంత్రులు జగదీష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సీఎస్



జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించి ఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో హోం మంత్రి



మెడికల్ కాలేజీ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రంలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ లింగయ్య, ఎమ్మెల్యేలు కిషోర్, సైదిరెడ్డి, మల్లయ్య



బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేస్తున్న సీఎం

బీమాతో జీపీ కార్మికులకు ధీమా

- మల్టీ పర్పస్ వర్కర్లకు రూ.5లక్షల బీమా సౌకర్యం
- ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థికసాయం
- జిల్లాలో 1,979 మందికి ప్రయోజనం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గ్రామ పంచాయతీ (జీపీ)ల్లో పనిచేసే మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కొన్ని రోజుల క్రితం పంచాయతీ కార్మికులు చేసిన నిరవధిక సమ్మెతో ప్రభుత్వం కాస్త దిగివచ్చింది. పంచాయతీల అభివృద్ధికి సేవలందిస్తున్న కార్మికుల కుటుంబాలకు సామాజిక భద్రత కింద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్మికులు చనిపోతే వారి కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.10 వేలు, ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల బీమా వర్తించేలా ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో జిల్లాలో 1,979 మంది గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది.

సమ్మెతో కదలిక..

జిల్లాలో 475 పంచాయతీలు ఉండగా 1,979 మంది కార్మికులు ఆయా పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు నెల రోజుల పాటు సమ్మె చేశారు. కనీస వేతనం పెంచాలని, ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. దీంతో ప్రభుత్వం న్యాయం చేస్తుందని భావించిన కార్మికులు ఇటీవల సమ్మె విరమించి విధుల్లో చేరారు. కనీస వేతనం పెంపు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఏదైనా కారణంతో కార్మికులు చనిపోతే పంచాయతీ పాలకవర్గం అంత్యక్రియలకు ఇది వరకు రూ.5 వేలు చెల్లించేది. దాన్ని రూ.10 వేలకు పెంచింది. కార్మికులకు ఇది వరకు బ్యాంకు ఖాతా తీస్తే బీమా సౌకర్యం ఉండేది. ఇప్పుడు ఎల్ఐసీ ద్వారా రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నారు.

ప్రీమియం చెల్లింపు బాధ్యత పంచాయతీలదే..

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకంలో నమోదైన కార్మికుడు ఎవరైనా మరణిస్తే రూ.5 లక్షలు జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ద్వారా ఆర్థిక సాయం రూపంలో అందుతుంది. అయితే కార్మికులకు సంబంధించి ప్రీమియం సంబంధిత గ్రామ పంచాయతీలు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్మికులు ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం ఇచ్చే రూ.10 వేల ఆర్థికసాయం గ్రామ పంచాయతీలే భరించాల్సి ఉంది. ప్రభుత్వం నేరుగా బీమా చేయించాలని, అంత్యక్రియలకు చెల్లించే మొత్తం ప్రభుత్వమే భరించాలని కార్మికులు కోరుతున్నారు.

పల్లెలకు సౌర వెలుగులు!

- జిల్లాలో 1,401 యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు
- పైలట్ ప్రాజెక్టు కింద రెండు గ్రామాల ఎంపిక
- రుణ మంజూరుపై కార్యాచరణ సిద్ధం చేసిన కేంద్రం



సూర్యాపేటలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ పలకలు (ఫైల్)

నాగారం: రాష్ట్రంలోని పల్లెలన్నింటికీ సౌర వెలుగులు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. స్త్రీనిధి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరు, నడిగూడెం మండలం నారాయణపురం గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన అధికారులు ఆయా చోట్ల 1,401 సోలార్ యూనిట్లను నెలకొల్పాలని భావిస్తున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యుల ద్వారా సౌర యూనిట్ల స్థాపనకు ఐకేపీ సిబ్బంది, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నారు. సోలార్ యూనిట్ల స్థాపనకు ఇళ్ల స్లాబ్‌లపై అవసరమైన విస్తీర్ణం కలిగిన స్వశక్తి మహిళల ఇళ్లను సర్వే చేసి గుర్తిస్తారు. వారికి రుణాలపై అవగాహన కల్పించి ప్రోత్సహించనున్నారు. యూనిట్లు స్థాపించడానికి ఆసక్తి ఉన్న వారికి రుణ మంజూరుకు స్త్రీనిధి సిబ్బంది ప్రతిపాదనలు తయారు చేస్తారు. రెడ్‌కో, డిస్కంల ద్వారా యూనిట్లు స్థాపించడానికి అనుసరించాల్సిన విధివిధానాలను తెలియజేస్తారు. మూడు విభాగాల్లో స్థాపించే యూనిట్లకు దరఖాస్తు రుసుము రూ.1180, రూ.2,360, రూ.3,540గా ఉంటుంది.

సోలార్ విద్యుత్‌తో లాభాలు పొందేలా..

సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసుకునే రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్లకు కేంద్ర ప్రభుత్వం ఎంఎన్ఆర్ఈ (మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ) టీఎస్ రెడ్‌కో ద్వారా రుణాలకు రాయితీ వర్తింపజేస్తుంది. ఉత్పత్తి అయ్యే పవర్‌ను నెట్ మీటరింగ్ ద్వారా రోజువారీ గృహ అవసరాలకు వినియోగిస్తూ మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కి అనుసంధానం చేసి టీఎస్ ట్రాన్స్‌కోకు బదిలీ చేయవచ్చు. యూనిట్ నెలకొల్పిన తరువాత అవసరమైన విద్యుత్ వినియోగించుకొని మిగులు విద్యుత్‌ను అమ్ముకొని లాభాలు గడించేలా సంస్థలు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తాయి.

ఎంపిక చేసిన పల్లెలు..

మండలం	గ్రామాలు	గృహాలు
ఆత్మకూర్(ఎస్)	ఏపూరు	1,031
నడిగూడెం	నారాయణపురం	370

యూనిట్ ధర, రుణ వివరాలు (రూపాయల్లో)..

సౌర విద్యుత్ యూనిట్ సామర్థ్యం	ప్రాజెక్టు అంచనా	రాయితీ	రుణం	వినియోగదారుడి వాటా
కిలో వాట్స్ ప్యానల్ (కేడబ్ల్యూపీ-1)	83,700	14,588	70,000	3,242
కేడబ్ల్యూపీ-2	1,44,000	29,176	1,15,000	5,134
కేడబ్ల్యూపీ-3	2,06,400	49,764	1,60,000	9,126

రుణ నిబంధనలు ఇలా..

- గ్రామ సంఘం, స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) బకాయిలు ఉండరాదు.
- సంఘం నెలకు రూ.100 చొప్పున సమృద్ధి పొదుపు చేసి ఉండాలి.
- సంఘాలు నేరుగా స్త్రీనిధికి గూగుల్ పే, ఫోన్ పే ద్వారా చెల్లించాలి.
- రుణంపై సంవత్సరానికి 11శాతం వడ్డీ ఉంటుంది.
- రుణం పొందిన ప్రతి సభ్యురాలికి సురక్ష రుణ బీమా ఉంటుంది.
- తీసుకున్న రుణం మొత్తాన్ని నిర్దేశించిన నెలవారీ వాయిదాల్లో చెల్లించాలి.
- క్రమం తప్పకుండా నెలవారీ వాయిదాల సమావేశం తేది నుంచి ఏడు రోజుల లోపు సంఘం నేరుగా చెల్లిస్తే ఆ సంఘానికి 0.5 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తాం..



గ్రామాల్లో సౌర యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేస్తాం. సోలార్ ప్లాంట్ల స్థాపన వల్ల కలిగే ప్రయోజనాలు వివరించడానికి స్త్రీనిధి అధికారులు, ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, వీఓలను సన్నద్ధం చేశాం. ఎంపిక చేసిన గ్రామాల్లో సౌర యూనిట్ల స్థాపనకు ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

పిల్లలమర్రి ఆలయంలో సీఎస్ పూజలు



పిల్లలమర్రి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎస్ శాంతికుమారి

సూర్యాపేట రూరల్: సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం పిల్లలమర్రి చారిత్రక దేవాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రత్యేక పూజలు చేశారు. సీఎం పర్యటన నిమిత్తం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆమె ఆదివారం దేవాలయాలను సందర్శించారు. ఎరకేశ్వరాలయం, నామేశ్వరాలయం, త్రికుటేశ్వరాలయాలను సందర్శించి దేవాలయాలు చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ ప్రియాంక, శిశు సంక్షేమ శాఖ అధికారి జ్యోతిపద్మ, అధికారులు ఉన్నారు.

రాజీవ్‌గాంధీతోనే దేశంలో సాంకేతిక విప్లవం

- పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదేనని పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం దివంగత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డలో రాజీవ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఆర్ మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు. దేశంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారని, పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి పేదల చేతిలో అధికారం పెట్టారని ఆయన తెలిపారు. సాంకేతిక విప్లవం తీసుకు వచ్చింది రాజీవ్ గాంధీ అని ఆయన గుర్తు చేశారు. రాజీవ్ స్ఫూర్తితో మళ్లీ దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదామని తెలిపారు. యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వేణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దామోదర్‌రెడ్డి, నాయకులు

క్లుప్తంగా

'రీజినల్' బాధితులకు న్యాయం చేయకపోతే దీక్ష



రైతులతో మాట్లాడుతున్న గూడూరు నారాయణరెడ్డి

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు బాధితులకు ఎమ్మెల్యేనే న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరి శివారులోని రాయగిరిలో భూములు కోల్పోతున్న రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి న్యాయం చేయకపోతే దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితుల రైతులు ఆవుశెట్టి పాండు, గడ్డమీది మల్లేష్, ఈదులకంటి కరుణాకర్, మధుసూదన్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, శివశంకర్, రామకృష్ణారెడ్డి, బిక్షపతి, భద్రప్ప, సురేష్, వీరయ్య, ఉపేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా భువనగిరి నియోజకవర్గ పర్యటనకు ఇన్‌చార్జిగా కర్నాటక నుంచి వచ్చిన ఆ పార్టీ నాయకుడు అవినాష్‌కి గూడూరు నారాయణరెడ్డి స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నల్లమాసు సుమవెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉడుత భాస్కర్, నాయకులు తుమ్మల నగేష్, రామకృష్ణారెడ్డి, రాజు, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంస్థాన్‌నారాయణపురంలో జరిగిన సీపీఐ మునుగోడు నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్, సీపీఐ పొత్తులో భాగంగా మునుగోడు సీటు ఎవరికి ఇచ్చినా అందరూ కలిసికట్టుగా పని చేయాలని కార్యకర్తలను కోరారు. తమ పార్టీ బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్‌తో కలిసి వెళ్తుందన్నారు. ఈ సమావేశంలో యాద్రాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లా కార్యదర్శులు గోద శ్రీరాములు, నెల్లికంటి సత్యం నాయకులు అంజాచారి, బచ్చనగోని గాలయ్య, కే.శ్రీనివాస్, దుబ్బాక భాస్కర్, నర్సింహ, కలకొండ సంజీవ పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేయాలి

ఆలేరురూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయాలని, అందుకు పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కర్నాటక రాష్ట్రంలోని షీరాహట్టి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రు కె.లమాని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా ఆదివారం ఆలేరు పట్టణంలో నిర్వహించిన ఆలేరు నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రజలకు పోరాటాలు కొత్తేమీ కాదని, రాష్ట్రంలో నయా నిజాం సర్కారును గద్దె దించడానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను సన్నద్ధం చేయాలని కోరారు. గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. నియోజకవర్గ కన్వీనర్ చిరిగె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదగాని హరిశంకర్‌గౌడ్, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్, నాయకులు బొట్టు అబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉట్కూరి సురేష్, తిరుమల్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు బడుగు జాహంగీర్, రాఘవేంద్ర, ఎల్లేష్ పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి పర్యటన చిత్రమాలిక



సూర్యాపేట నియోజకవర్గ ప్రగతి నివేదన సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్ చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తదితరులు



సూర్యాపేట కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న చీఫ్‌సెక్రటరీ శాంతికుమారి



సీఎం కేసీఆర్‌తో మంత్రి జగదీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు



మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి సీఎం బస్సులో వెళ్తుండగా పూలు చల్లుతున్న విద్యార్థులు



సీఎంతో మాట్లాడుతున్న కాసోజు శంకరమ్మ



మాట్లాడుతున్న కిషోర్,



సభలో ఓ అభిమాని..



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం, పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ



సమీకృత మోడల్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్



జీఓ నంబర్ 46 నుంచి టీఎస్‌ఎస్‌పీ పోస్టులను మినహాయించాలని ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు



సభా వేదికపైకి వస్తూ నాయకులకు నమస్కరిస్తున్న సీఎం

సీఎం కేసీఆర్ సభ సైడ్ లైట్స్

- సూర్యాపేట సభకు సీఎం కేసీఆర్ మూడు గంటలు ఆలస్యంగా చేరుకున్నారు.
- షెడ్యూల్ ప్రకారం 11.30గంటలకు రావాల్సి ఉండగా 2.39గంటలకు ఎస్వీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు.
- అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో మెడికల్ కళాశాలకు చేరుకొని 2.50గంటలకు చేరుకుని కళాశాల భవనాన్ని ప్రారంభించారు.
- మెడికల్ కళాశాల నుంచి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు చేరుకుని 3.15 గంటలకు మార్కెట్‌ను ప్రారంభించారు. మార్కెట్‌లో కలియతిరిగి స్టాళ్లను పరిశీలించారు.
- బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకుని 3.40 గంటలకు కార్యాలయాన్ని ప్రారంభించారు.
- బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి 3.45గంటలకు సీఎం కేసీఆర్ చేరుకున్నారు. అక్కడ పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి కార్యాలయాన్ని ప్రారంభించారు.
- అక్కడి నుంచి సమీకృత కలెక్టరేట్‌కు 4.10గంటలకు చేరుకున్నారు. 4.17గంటలకు నూతన కలెక్టర్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. 4.45గంటల వరకు అక్కడే ఉన్నారు.
- కలెక్టరేట్ నుంచి 4.45 కు బయలుదేరి 5.03గంటలకు ప్రగతి నివేదన సభాస్థలికి చేరుకున్నారు.
- సాయంత్రం 6గంటలకు సభ ముగించుకుని హైదరాబాద్‌కు బయలుదేరివెళ్లారు.

– సూర్యాపేట క్రైం, సూర్యాపేటటౌన్

టీఎస్‌ఎస్‌పీ అభ్యర్థుల నిరసన

దురాజ్‌పల్లి : పోలీస్ నియామక ప్రక్రియలో తమకు అన్యాయం జరుగుతుందంటూ సీఎం కేసీఆర్ సభలో టీఎస్ ఎస్‌పీ అభ్యర్థులు నిరసన తెలిపారు. ప్రస్తుత నోటిఫికేషన్‌లో జీవో నెంబర్ 46 తొలగించాలని, ఈ జీవోతో చాలామంది అభ్యర్థులు నష్టపోతున్నారని ప్లకార్డులు ప్రదర్శించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ బెటాలియన్‌కు ఒకటే కట్ ఆఫ్ మార్కులు ఉండగా జీవో నెంబర్ 46 తో ఏ జిల్లాకు ఆ జిల్లా ఇవ్వడం సరైంది కాదని తమ ఆవేదన వ్యక్తం చేశారు అలాగే 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

ప్రభుత్వ కార్యాలయాలు, మోడల్ మార్కెట్ ప్రారంభం

దురాజ్‌పల్లి / భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో రూ.కోట్లతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు సీఎం కేసీఆర్ సమక్షంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలుత 21 ఎకరాల విస్తీర్ణంలో రూ.65కోట్లతో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు పండితులు పూర్ణకుంభం, వేదమంత్రాలతో స్వాగతం పలికారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకట్రావును కలెక్టర్ చాంబర్‌లో సీఎం కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సర్వమత పెద్దల ఆశీర్వచనాల మధ్య కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా..

సూర్యాపేటలో రూ.30.18 కోట్లతో జర్మనీ టెక్నాలజీతో నిర్మించిన సమీకృత వెజ్-నాన్ వెజ్ మార్కెట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితో ప్రారంభింపజేశారు. అనంతరం వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్దకు వెళ్లి వ్యాపారులతో సంభాషించారు. అంతకుముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మార్కెట్‌ను పరిశీలించారు.

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా...

సూర్యాపేటక్రైం : జిల్లా పోలీస్ కార్యాలయ నూతన భవనాన్ని సీఎం కేసీఆర్ వేద మంత్రాల నడుమ ప్రారంభించారు. రూ.38.50 కోట్లతో 20 ఎకరాల్లో 56 వేల చదరపు అడుగుల్లో మూడు అంతస్తుల్లో నూతనంగా నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న కేసీఆర్‌కు పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సీఎం కేసీఆర్ జిల్లా పోలీస్ కార్యాలయం ప్రారంభించి ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ కు పుష్ప గుచ్ఛం అందజేసి సీట్లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు హోం మంత్రి మహమూద్‌అలీ, డీజీపీ అంజనీకుమార్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు.

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం..

భారత రాష్ట్ర సమితి నూతన కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ముందుగా కార్యాలయానికి చేరుకున్న సీఎంకు జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ ఘన స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడిని కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ వైద్య కళాశాల..

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలో రూ.156కోట్ల వ్యయంతో నిర్మించిన వైద్య కళాశాలను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు .. విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆ కళాశాల విద్యార్థులతో సీఎం ముచ్చటించారు. వైద్య కళాశాల సిబ్బంది సీఎంను మెమెంటోతో సత్కరించారు. మెడికల్ కళాశాల ప్రారంభానికి వచ్చిన సీఎంకు సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మంత్రులు జగదీష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ లక్ష్మీ బాయ్, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, శానంపూడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో ప్రీవెడ్డింగ్ షూట్!

సూర్యాపేట: పోలీస్ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం మినీట్యాంక్ బ్యాండ్ మీదుగా వెళుతున్న సమయంలో పక్కనే ఉన్న శ్మశాన వాటికను స్థానిక మంత్రి జగదీష్‌రెడ్డి సీఎంకు చూపిస్తూ శ్మశాన వాటికలో సెల్ఫీలు దిగుతున్నారని ప్రస్తావించారు. దీంతో సీఎం బదులిస్తూ.. భవిష్యత్తులో ప్రీవెడ్డింగ్ షూట్‌లు సైతం జరుగుతాయని చెప్పినట్లు తెలిసింది.

పాటలతో ఉర్రూతలూగించిన కళాబృందాలు

సభా ప్రాంగణంలో బీఆర్‌ఎస్ పార్టీ కళాబృందాలు పాటలతో జనాన్ని ఉర్రూతలూగించాయి. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ తమ ఆట పాటలను ప్రదర్శించారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ సాగిన పాటలకు కార్యకర్తలు కేరింతలు కొట్టి కళాకారులను ఉత్సాహపర్చారు.

విధి నిర్వహణలో అన్నదమ్ములు



సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన సందర్భంగా అన్నదమ్ములు ఒకేచోట విధులు నిర్వర్తించారు. చివ్వెంల మండలం గాయంవారిగూడెం గ్రామానికి చెందిన పల్లా జానకి రాములు సూర్యాపేట టౌన్ పోలీస్‌స్టేషన్లో ఏఎస్‌ఐగా విదులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మూడో తమ్ముడు పల్ల జగన్ నాగర్‌కర్నూల్‌లో రిజర్వ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం నూతన కలెక్టరేట్ వద్ద అన్నతమ్ములిద్దరూ విధులు నిర్వర్తించారు. ఇద్దరు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నా.. అనుకోకుండా ఒకే చోట తారసపడడంతో అన్నను తమ్ముడు గౌరవించడం చూపరులను ఆకట్టుకుంది.

భద్రపరిచిన తాళం చెవితో తాళం తెరిచి..

- రూ.60వేల నగదు, బంగారు ఆభరణాల అపహరణ

ఆత్మకూరు(ఎం): గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి యజమాని భద్రపరిచిన తాళం చెవితోనే తాళం తెరిచి చోరీకి పాల్పడ్డారు. ఆత్మకూర్(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లెర్ల గ్రామానికి చెందిన వంటిపెంటి మాధవరెడ్డి మాధవరెడ్డి కుటుంబ సభ్యులు శనివారం ఇంటికి తాళం వేసి శుభకార్యానికి హాజరయ్యేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళం చెవిని ఇంటి ఆవరణలోనే ఓ రహస్య ప్రదేశంలో భద్రపరిచి వెళ్లారు. ఆదివారం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం వేసినట్టే ఉండగా రహస్య ప్రదేశం ఉంచిన తాళం చెవి కనిపించలేదు. అటు ఇటు వెతకగా చివరకు తాళం చెవి కనిపించింది. మాధవరెడ్డి కుటుంబ సభ్యులు తాళం తీసి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.60వేల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఘటనాస్థలిలో లభించిన ఇనుపరాడ్, బార్ష, డ్రిల్లింగ్ మిషన్, కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. జాగిలాలతో గాలించగా కొద్దిదూరంలో ఓ ఇంటి వద్ద ఆగిపోవడం గమనించారు. బాధితుడు మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.



మాధవరెడ్డి ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

ప్రభుత్వ ఉద్యోగం రాలేదని..

- ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మహేష్ (ఫైల్)

ఆత్మకూరు(ఎం) : ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్‌లో చోటుచేసుకుంది. కొరటికల్ గ్రామానికి చెందిన బత్తెపు మహేష్(24) రెండేళ్ల క్రితం బీపీడీ కోర్సు పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా పలు పరీక్షలు రాశాడు. అయినప్పటికీ ఎటువంటి ఉద్యోగం రాకపోవడంతో నెల రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా మహేష్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన మహేష్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మధ్యాహ్న సమయంలో కుటుంబ సభ్యులు ఇంటికి రాగా మహేష్ అప్పటికే మృతిచెందాడు. ఉద్యోగం రావడం లేదంటూ అప్పుడప్పుడు తల్లిదండ్రులతో అంటుండేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దొమ్మేటి నాగరాజు తెలిపారు.

పాలడుగులో...

మోత్కూరు : మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన గుంటోజు నర్స య్య, ఉమాదేవి దంపతులు తమ ఇద్దరు కుమారులతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. పెద్దకుమారుడు ఉదయ్‌కుమార్ (25) ఇంటర్మీడియట్ వరకు చదువుకొని హైదరాబాద్‌లో కార్పెంటర్ వృత్తి చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం బోనాల పండుగకు నర్సయ్య తన కుటుంబ సభ్యులతో స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులు ఆలయం వద్దకు బోనం తీసుకెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఉదయ్‌కుమార్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయ్‌కుమార్‌కు కొంత కాలంగా మానసిక స్థితి సక్రమంగా లేదని తెలిసింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి..

పెన్‌పహాడ్ : పురుగుల మందు తాగి ఓ యువకులు ఆత్మహత్య చేసుకున్నాడు. పెనపహాడ్ మండలం సింగారెడ్డిపాలేనికి చెందిన మున్నా రామచంద్రయ్య కుమారుడు శంకర్(24) ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్యులు కాలు తీసేసారు. అప్పటి నుంచి శంకర్ ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆదివారం తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా శంకర్ ఇంట్లోరు పురుగుల మందు తాగాడు. సాయంత్రం తల్లి ఇంటికి రాగా అప్పటికే శంకర్ మృతిచెందాడు. కాలు లేదనే మనస్తాపంతోనే శంకర్ ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్తులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

రామన్నపేట : గుర్తు తెలియని వ్యక్తులు రామన్నపేట మండల కేంద్రంలోని ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదును అపహరించుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ జెడ్పీటీసీ నోముల పద్మా మారయ్య దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి మండలకేంద్రంలోని ఎంప్లాయిస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 18న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. వైద్యపరీక్షల అనంతరం శనివారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళం తీసి, బీరువా తెరిచి ఉన్నది. అందులోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. దొంగతనం జరిగిందని గుర్తించిన వారు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పంచనామా నిర్వహించారు. ఆదివారం క్లూజ్‌టీంను రప్పించి ఆనవాళ్లు సేకరించారు. రెండు తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండితోపాటు రూ 40వేలు అపహరించుకు పోయినట్లు గుర్తించారు. శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దుండగులు తెరిచిన బీరువా

ఆటో డ్రైవర్ మృతి

చౌటుప్పల్ : చౌటుప్పల్ లో ఆదివారం ఓ ఆటో డ్రైవర్ ఆకస్మికంగా మృతిచెందాడు. వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన కోల శ్రీరాములు(48) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీ మాదిరిగా స్వగ్రామం నుంచి ఉదయం 7గంటలకు ప్రయాణికులను ఎక్కించుకొని చౌటుప్పల్‌కు వచ్చాడు. తిరిగి గోకారం వెళ్లేందుకు ఆటోను సీరియల్‌లో పెట్టాడు. సీట్‌లోనే కూర్చొని ఉన్న ఆయన పక్కకు పడి ఉండడాన్ని సమీపంలోనే ఉన్న ఇతర ఆటో డ్రైవర్లు గమనించారు. వెంటనే సమాచారం అందించగా అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. గుండెపోటుతో చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు.

పంచలోహ విగ్రహాలు చోరీ

రామన్నపేట : గుర్తుతెలియని వ్యక్తులు పంచలోహ విగ్రహాలను అపహరించారు. ఈ ఘటన రామన్నపేట మండలంలోని బోగారం గ్రామంలోని మద్దెలమ్మ దేవాలయంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి వెళ్లే దారిలో పద్మశాలీయుల ఆరాధ్యదైవం మద్దెలమ్మతల్లి దేవాలయం కలదు. రాఖీపౌర్ణమి సమీ పిస్తుండడంతో ఆలయానికి రంగులు వేయించడం కోసం భక్తులు ఆదివారం ఆలయం వద్దకు వెళ్లారు. ఆలయం తలుపులు తెరిచి చూడగా మద్దెలమ్మ, బృగుమహర్షి, గణపతి, సుబ్రమణ్యస్వామి పంచలోహ విగ్రహాలు కని పించలేదు. విగ్రహాలతోపాటు పాటు రాగి చెమ్మె, శఠగోపం, గంటను దుండగులు అపహరించుకు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు జరుపుతున్నారు.

29 తులాల బంగారం..

కోదాడరూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి 29 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని గోపిరెడ్డినగర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపిరెడ్డినగర్‌లో నివాస ఉండే మున్సిపల్ ఏఈ చంద్రశేఖర్ శనివారం రాత్రి తొమ్మిదిగంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లారు. 11 గంటలకు వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో పాటు బీరువాలో దాచిన 29 తులాల బంగారం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గన్‌తో వచ్చి.. ఇంట్లోకి చొరబడి..

- కోదాడలో టీచర్ ఇంట్లో చోరీకి యత్నం
- ఎవరని ప్రశ్నించిన బ్యాంకు ఉద్యోగిని గన్‌తో బెదిరించి పరారైన దొంగలు
- బిహార్ గ్యాంగ్‌గా అనుమానిస్తున్న పోలీసులు

కోదాడరూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి గన్‌తో ఓ టీచర్ ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించారు. గమనించిన ఎదరింట్లో నివాసముంటున్న బ్యాంకు ఉద్యోగి అక్కడకు వెళ్లి ఎవరని ప్రశ్నించడంతో దుండగులు గన్‌తో బెదిరించి కారులో పరారయ్యారు. కోదాడలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ పట్టణం హుజూర్‌నగర్ రోడ్‌లో టీచర్స్‌కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పందిరి గోపిరెడ్డి కుటుంబ సభ్యులు ఉదయం పదిగంటల సమయంలో ఇంటికి తాళం వేసి ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు నేరేడుచర్లకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత కారులో ముగ్గురు వ్యక్తులు వచ్చి గోపిరెడ్డి ఇంటికి సమీపంలో వాహనాన్ని నిలిపారు. ఇద్దరు వ్యక్తులు కారు దిగి గోపిరెడ్డ ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. కొత్త వ్యక్తులు గోపిరెడ్డి ఇంట్లోకి వెళ్లడాన్ని ఎదురుగా నివాసం ఉంటున్న బ్యాంకు ఉద్యోగి గమనించాడు. వెంటనే గోపిరెడ్డి ఇంటికి వెళ్లి కాలింగ్ బెల్ కొట్టాడు. తలుపు తీసిన దుండగులు హిందీలో మాట్లాడుతూ బయటికి వచ్చారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

బెదిరించి.. ఫోన్ లాక్కొని..

అప్పటికే బ్యాంకు ఉద్యోగికి గోపిరెడ్డికి ఫోన్ చేసి మీ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారని ఫోన్‌లో సమాచారం ఇస్తుండగానే దుండగులు అతడి ఫోన్‌ను లాక్కున్నారు. వారు తీసుకెళ్తున్న బ్యాగులో ఏమున్నాయని సదరు బ్యాంకు ఉద్యోగి ప్రశ్నించగా దుండగులు గన్ తీసి బెదిరించారు. అనంతరం వచ్చిన కారులోనే పరారయ్యారు. కొద్ది దూరం వెళ్లాక ఫోన్‌ను పడవేసి వెళ్లినట్లు లొకేషన్ చూపించింది.

నగదు, ఆభరణాలు సేఫ్

గోపిరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బీరువాల్లో దాచిన సుమారు 9 తులాల బంగారు, రూ.50వేల నగదు సేఫ్‌గా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సకాలంలో బ్యాంకు ఉద్యోగి స్పందించడంతోనే దొంగల చోరీ యత్నం విఫలమైనట్లు పోలీసులు తెలిపారు. దుండగులు బీహార్ లేదా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు.